సాక్షి
వికారాబాద్

ఆదివారం । 28 । జూలై । 2024



ఏకాగ్రత అవసరం
విద్యార్థులకు పట్టుదల, ఏకాగ్రత ఎంతో అవసరమని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. 10లో▸



పెరుగుతున్న ప్రమాదాలు
గుంతల రోడ్లతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. 10లో▸



అమ్మ కోసం ఒక మొక్క
ప్రతి విద్యార్థీ తన తల్లి కోసం ఒక మొక్కను నాటి, సంరక్షించాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి సూచించారు. 11లో▸

న్యూస్‌రీల్

కార్గో సేవలను వినియోగించుకోండి



కార్గో సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

కొడంగల్: కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) రవీందర్ సూచించారు. శనివారం పట్టణంలోని బస్టాండ్‌లో కార్గో కొరియర్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గో సేవలను మరింత అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రజలు వారి వస్తువులను ఇతర ప్రాంతాలకు సురక్షితంగా చేరవేసేందుకు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కువ ధరకు తక్కువ సమయంలో పార్సిళ్లను చేరవేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఈ భాను ప్రసాద్, డీఎంఈలు చంద్రయ్య, వసంత్, విశ్వనాథ్ గౌడ్, కార్గో ఏజెంట్ నరేష్ కుమార్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మారుతీకిరణ్

పరిగి: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని శనివారం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌కు వచ్చిన ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు.

అనంతగిరికి పర్యాటకుల తాకిడి



అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టకు శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ముందుగా ఆలయంలో అనంత పద్మనాభస్వామి దర్శించుకున్న పర్యాటకులు అనంతరం నంది ఘాట్ అడవిలో విహరించారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

శ్రీవారి ఆలయ విస్తరణకు చర్యలు



ఇళ్లు కోల్పోతున్న వారి పేర్లు నమోదు చేసుకుంటున్న అధికారులు

కొడంగల్ రూరల్: పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణకు శనివారం దేవాదాయ, రెవెన్యూ శాఖలు చర్యలు చేపట్టాయి. ఆలయ అభివృద్ధికి 5 ఎకరాల స్థలం అవసరం ఉందని ఈఓ నరేందర్ తెలిపారు. ఇందులో భాగంగా 86ఇళ్లను తొలగించాల్సి ఉంటుందని తెలిపారు. కుమ్మరివాడలో ఇళ్లు కోల్పోతున్న వారి పేర్లను నమోదు చేసుకొని కొలతలు చేపట్టారు. ఆర్ఐ రాఘవేందర్, సర్వేయర్ మురళీధర్, రెవెన్యూ సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ సందడి

పంచాయతీ ఎన్నికలకు అధికారుల కసరత్తు

- జనవరి 31తో ముగిసిన సర్పంచుల పదవీ కాలం
- కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన
- జిల్లాలో 565 జీపీలు
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు



దోమ మండలం పాలేపల్లి పంచాయతీ కార్యాలయం

వికారాబాద్: మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియగా పంచాయతీ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే జీపీ పోరు పూర్తి కావాల్సి ఉన్నా అనివార్యకారణాల వల్ల ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఓటరు జాబితాను రూపొందించాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దీంతో అందరి దృష్టి గ్రామ పంచాయతీ ఎన్నికలపై పడింది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీ కాలం కూడా ముగిసింది. త్వరలో మున్సిపల్ కౌన్సిలర్ల గడువు కూడా ముగియనుంది. 2023 – 24ను ఎలక్షన్ ఇయర్‌గా చెప్పవచ్చు. లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది అనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.

ప్రక్రియ షురూ..

జిల్లాలో 565 పంచాయతీలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. వాటికి అదనంగా మరి కొన్ని బూత్‌లు అవసరమవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు బూత్‌లను ఏర్పాటు చేయగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదనపు పోలింగ్ కేంద్రాలు, ఎంత మేర సిబ్బంది అవసరం వంటి వివరాలు సేకరిస్తున్నారు. ఓటర్లను వార్డుల వారీగా విభజించి ఎన్ని బూతులు అవసరం అనే దానిపై చర్చిస్తున్నారు.

రంగంలోకి ఆశావహులు

జిల్లాలో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను గతంలో ఆ సామాజిక వర్గానికే రిజర్వు చేశారు. దీంతో బీసీ రిజర్వేషన్లకు అన్యాయం జరిగిందనే వాదన తెరపైకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 4,850 వార్డులు ఉన్నారు. వీటి ఆధారంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. బరిలో నిలిచేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ గ్రూపులు, వర్గాలను కూడగట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

మండలాల వారీగా గ్రామ పంచాయతీల వివరాలు

మండలం	జీపీల సంఖ్య
బంట్వారం	11
బషీరాబాద్	36
బొంరాస్‌పేట	47
ధారూరు	32
దోమ	36
దౌల్తాబాద్	33
కొడంగల్	26
కోట్‌పల్లి	18
కుల్కచర్ల	44
మర్పల్లి	27
మోమిన్‌పేట	28
నవాబుపేట	32
పరిగి	37
పెద్దేముల్	37
పూడూరు	31
తాండూరు	33
వికారాబాద్	21
యాలాల	37



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తుండి పోతారని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. వికారాబాద్ ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రెడ్డి, సిబ్బంది వెంకటయ్య బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగికీ వృత్తిరీత్యా బదిలీలు సహజమన్నారు. మనం చేసిన సేవలే గుర్తుండిపోతాయన్నారు. అనంతరం బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, ఏపీఓ శీను, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఆఫీసుతో మెరుగైన సేవలు

రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి శాఖలో ఈ – ఆఫీసు సేవలను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ – ఆఫీసు సేవలపై జిల్లా అధికారులు, సిబ్బందికి ఎన్ఐసీ ద్వారా వర్చువల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందుకే ప్రతిశాఖలో ఈ – ఆఫీసు విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కలెక్టర్ శశాంక స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. శాఖల వారీగా ఈ – మెయిల్ ఐడీలను క్రియెట్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. ఐడీలు క్రియేట్ కాకుంటే త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఈ-ఆఫీసు విధానంతో సేవలు సులభతరం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఐసీ అధికారి స్వర్ణలత ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరిగి: రుణమాఫీ పొందిన రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ గోపాల్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

పరిగి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. శనివారం మండలంలోని నస్కల్ గ్రామంలో రుణమాఫీ పథకం పొందిన రైతులతో మాట్లాడారు. కొత్త పాసుపుస్తకం ఉన్న ప్రతి ఒక్కరూ రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్, పాసుపుస్తకాలు వచ్చిన వారు మాత్రమే అర్హులన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ కాని రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తెస్తే పథకం అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార ధృక్పథం వద్దు

కుల్కచర్ల: విత్తనాలు, ఎరువులు విక్రయించే ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు వ్యాపార ధృక్పథం వీడాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. శనివారం కుల్కచర్లలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. రేషన్ కార్డు లేని రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో కనిపించడం లేదని త్వరలో వారి వివరాలు సేకరించి పథకం అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ బాబు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ చేరాలి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డీటీలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: నిర్ణీత సమయంలో సీఎంఆర్ పౌరసరఫరాల శాఖకు చేరాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు సూచించారు. సీఎంఆర్ సరఫరాలో ఆలస్యం జరుగుతుండటంతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021–22 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్‌ను ఆగస్టు 15లోపు అందజేయాలని సూచించారు. అదేవిధంగా 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్‌ను సెప్టెంబర్ మొదటి వారంలోగా ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఇకపై గడువు పెంచబోమని స్పష్టం చేశారు. మిల్లుల యజమానులు, యూనియన్ నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి బియ్యాన్ని నిర్ణీత గడువులోగా ఇచ్చేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లాలోని రైసు మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని డిప్యూటీ తహసీల్దార్లకు సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీటీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హిమాయత్‌నగర్, చిన్నమంగళారం గ్రామాల ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదును మండల బాధ్యులు బందయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓగా ప్రమోషన్లు వచ్చేలా చూస్తామని తెలిపారు. పెండింగ్‌లో డీఏలను 50శాతం ఫిట్‌మెంట్‌ను ఇప్పిస్తామని చెప్పారు. జీఓ 11,12ను సవరించి ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాములు, చేవెళ్ల మండల శాఖ కార్యదర్శి వినోద్, నరేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వేణుగోపాల్, నరేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎంత భూమి సేకరించారు

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కుర్మిద్ద ఫార్మా భూముల్లో పర్యటన



కుర్మిద్ద ఫార్మా భూముల్లో పర్యటిస్తున్న కలెక్టర్ శశాంక, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కుర్మిద్ద గ్రామంలో ఫార్మా సిటీ ఏర్పాటుకు సేకరించిన భూములను శనివారం కలెక్టర్ శశాంక టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు టీఎస్ఐఐసీ అధికారులు ఎంత భూమి సేకరించారు.. ఇంకా ఎంత అవసరం ఉందని యాచారం తహసీల్దార్ అయ్యప్ప, కందుకూరు తహసీల్దార్ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యటిస్తున్న విషయం కుర్మిద్ద భూ బాధితులకు తెలియడంతో వారు హుటాహుటిన కలెక్టర్ పర్యటిస్తున్న ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టర్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫార్మా ఏర్పాటు చేస్తే ఊరుకోమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను ప్రశ్నించేందుకు ప్రజలు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ముఖ్యమంత్రి పర్యటన

టీఎస్ఐఐసీ సేకరించిన భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తారా.. మెగా టౌన్‌షిఫ్ ఏర్పాటు చేస్తారా అనే సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు తెలిసింది. మెగా టౌన్‌షిప్ నిర్మాణం కోసం పునాదిరాయి వేసేందుకు ఏర్పాట్లలో భాగంగానే కలెక్టర్ పర్యటించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్ణయంపై ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ముచ్చర్లలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ

కందుకూరు: మండలంలోని ముచ్చర్లలో ప్రభుత్వం సేకరించిన భూములను శనివారం కలెక్టర్ శశాంక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తోంది. ఇందుకు ముచ్చర్లలోని సర్వే నంబర్ 288 భూమిని పరిశీలించారు. ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి రానున్నట్లు తెలిసింది. 50 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.

నేడు ముఖ్యమంత్రి పర్యటన

సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు/కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలో సీఎం సభ ఏర్పాట్లు, కొట్ర గేటు వద్ద ఆవిష్కరించనున్న దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి సంబంధించిన ఏర్పాట్లను ఎరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సీఎం రేవంత్ కల్వకుర్తిలో పర్యటించనున్నారని, ఇందులో భాగంగా జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తిలో నిర్వహించే సంస్మరణసభలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, గూడూరి శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, జగన్, వస్పుల మానయ్య, బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల్లో డ్యాన్స్ వేసేవాణ్ని

- ఆ జ్ఞాపకాలు ఎంతో మధురం
- సినీ నటుడు ప్రియదర్శి



'నేను పెరిగింది హైదరాబాద్ పాతబస్తీలో. చిన్నప్పటి నుంచి లాల్ దర్వాజా బోనాలు చూస్తూ పెరిగాను. పోతరాజు వేషంలో డ్యాన్స్ చేసేవాళ్లని చూస్తుంటే సంతోషంగా ఉంటుంది. డ్రమ్స్, మ్యూజిక్, డ్యాన్స్ చూస్తుంటే బాడీలో ఒక వైబ్రేషన్ వస్తుంటుంది. ఇప్పుడు సినిమాల్లోకి వచ్చాక డైరెక్టుగా బోనాల్లో పాల్గొనలేకపోతున్నాను గాని.. లాల్ దర్వాజా, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ.. ఇలా అమ్మవార్ల బోనాల ఉత్సవాలను టీవీలో చూస్తుంటాను.. చాలా సంతోషంగా ఉంటుంది' అని సినీ నటుడు ప్రియదర్శి అన్నారు. సహాయ, కామెడీ పాత్రలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి.. నగరంలో బోనాల పండగ జోరుగా జరుగుతున్న సందర్భంగా 'సాక్షి'తో తన అనుభవాలను ఇలా పంచుకున్నారు.

'నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నేను గమనిస్తున్నది ఏంటంటే.. బోనాల తర్వాత మనకు తప్పకుండా వర్షం వస్తుంది. ఈ విషయాన్ని నేను ఏళ్ల తరబడి చూస్తున్నాను. బోనాల సమయంలో తప్పనిసరిగా వర్షం రావడం మంచిగా అనిపిస్తుంది. హైదరాబాద్‌లో అన్ని కులాలు, మతాల వారు బోనాల ఉత్సవాలను ఎంతో సంబరంగా జరుపుకోవడం సంతోషంగా ఉంటుంది. నేను చిన్నప్పుడు బోనాల్లో డ్యాన్స్ చేసేవాణ్ని. పోతరాజు వేషధారణల మధ్య డ్యాన్స్ చేయడమంటే నాకు చాలా ఇష్టం. అలాగే హైదరాబాద్‌లో యాదవ సోదరులు సదర్ ఉత్సవాలని ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. అవి కూడా నాకెంతో ఇష్టం.. నేను పాల్గొనేవాణ్ని. 'సేవ్ ద టైగర్స్' వెబ్ సిరీస్‌లో నేను ఘంటా రవి పాత్ర చేస్తున్నప్పుడు ఇలాంటివన్నీ బాగా రిఫరెన్స్‌గా వాడుకున్నా. సెలబ్రిటీ అయ్యాక బోనాలు, సదర్ ఉత్సవాల్లో డైరెక్టుగా పాల్గొనలేకపోతున్నాను. తప్పదు.. కొన్నింటిని త్యాగం చేయాల్సిందే. సంక్రాంతి పండగను ఆంధ్రప్రదేశ్‌లో ఎంత ఘనంగా జరుపుకుంటారో హైదరాబాద్‌లోనూ అంతే గ్రాండ్‌గా జరుపుకొంటారు. తెలంగాణలో సమ్మక్క– సారక్క, కొండగట్టు అంజన్న, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, మల్లన్న జాతర.. ఇలాంటివన్నీ సంస్కృతికి నిదర్శనం'. హిందువుల పండగలనే కాదు... నాకు అన్ని పండగలూ ఇష్టమే. ప్రత్యేకించి రంజాన్, బక్రీద్ సమయంలో ముస్లిం స్నేహితులని కలవడం.. వారు పెట్టే ఖీర్ (పాయసం) తినడం చాలా హ్యాపీగా ఉంటుంది' అన్నారు ప్రియదర్శి.

– సాక్షి, సినిమా డెస్క్

క్లుప్తంగా

దామగుండాన్ని సందర్శించిన అధికారులు

పూడూరు: మండల పరిధి దామగుండంలో నేవీరాడార్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయనుండటం తెలిసిందే. త్వరలో జరగనున్న శంకుస్థాపన నేపథ్యంలో శనివారం పరిసర ప్రాంతాలను ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, నేవీ అధికారులతో కలిసి సందర్శించారు. కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో వారు చర్చించారు. శంకుస్థాపనకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితర ప్రముఖులు రానుండగా.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర, పరిగి సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరంపై పోలీసుల దాడి



పోలీసుల అదుపులో నిందితుడు

పెద్దేముల్: నాటు సారా తయారీ స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడీ చేసి, సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తట్టెపల్లి గ్రామ శివారులో జాదవ్ చందర్.. తన పొలంలో సారా తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి, 15లీటర్ల సారా తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన 150 లీటర్ల బెల్ల పానకంను పారబోసి, చందర్‌పై కేసు నమోదు చేశారు. నిషేధించిన సారాను ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఇదే విషయం ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని, చెప్పిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

నిందితుడికి రిమాండ్

కేశంపేట: ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 10న ఓ వ్యక్తి హుండీని పగలగొట్టి నగదును అపహరించాడు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు మండల పరిధి మంగళిగూడ గ్రామానికి చెందిన పెరుమాళ్ల నర్సింహగా గుర్తించి శనివారం అరెస్టు చేశారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పోలిస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రవీంద్రకుమార్ రెండు నెలలుగా స్థానికంగా ఉన్న టీసీఎస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. ఠాణా ఎదుట ఉన్న ఓ అపార్ట్‌మెంటులో నివాసం ఉండేవాడు. ఈ నెల 25న మధ్యాహ్నం భోజనం చేసి తన గదిలోకి వెళ్లాడు. సాయంత్రం డ్యూటీకి రాకపోవడంతో తన మేనేజర్ ఫోన్ చేసినా రవీంద్ర తీయలేదు. దీంతో గదికి వచ్చి చూడగా.. రవీంద్ర(22) కిటికీకి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. డ్రాయర్ మాత్రమే ధరించి ఉన్నాడు. కాళ్లు కిందకు వేలాడటం, కిటికీకి ఉరి వేసుకోవడం, శరీరంపై గాయాలు ఉండటంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

మొయినాబాద్: మొయినాబాద్ నుంచి శ్రీరాంనగర్‌కు వెళ్లే రోడ్డు సురంగల్ గ్రామం వరకు కాస్త బాగున్నా అక్కడి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం పూర్తిగా గుంతలమయంగా మారింది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉండగా ప్రస్తుతం ముసురు వర్షాలకు గుంతుల పెద్దగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేదని భావించి శనివారం గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు మొరం తెప్పించి గుంతలు పూడ్చి రోడ్డును తాత్కాలికంగా బాగుచేసుకున్నారు.

విద్యార్థులకు పట్టుదల, ఏకాగ్రత అవసరం

- వారికి చదువుపై ఆసక్తి కలిగేలా పాఠాలు బోధించండి
- ఉపాధ్యాయులతో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి
- నంబర్ టు పాఠశాలను సందర్శన

తాండూరు టౌన్: విద్యార్థులకు పట్టుదల ఏకాగ్రత అవసరమని, ప్రణాళికాబద్ధంగా చదివించి, వారి సామర్థ్యాలను పెంపొందించాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఉపాధ్యాయులకు సూచించారు. పాలనాధికారులు స్వయంగా సర్కారు బడులను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుని, నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా శనివారం ఆమె పాత తాండూరులోని ప్రభుత్వ నంబర్ టు తెలుగు మాధ్యమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అకడమిక్ విద్యా ప్రమాణాలను, పునాది సంఖ్య అక్షరాస్యతను (ఎఫ్‌ఎల్‌ఎన్) తెలుసుకున్నారు. విద్యార్థులతో మమేకమై, వివిధ సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాలను పరిశీలించారు. వారిచే పాఠ్యాంశాలను చదివించడం, రాయించడం, ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం వంటివి ఆమె చేశారు. పలు అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేపట్టాల్సిన కృత్యాలను ఆమె వివరించారు. ఆమెతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అభిజిత్, మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభా భారతి తదితరులు ఉన్నారు.



విద్యార్థిని పక్కనే కూర్చుని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

ప్లాంటేషన్ పరిశీలన



తిప్పాపూర్‌లో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న రాంబాబు తదితరులు

అనంతగిరి: 2024 సంవత్సరానికి సంబంధించిన ప్లాంటేషన్ పనులను శనివారం అటవీశాఖ చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫీసర్ రాంబాబు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్ రేంజ్ పరిధి తిప్పాపూర్ రిజర్వు ఫారెస్టులోని 20 హెక్టార్ల ప్లాంటేషన్, పరిగి రేంజ్ మిట్టకోడూర్ రిజర్వు ఫారెస్టులోని 10 హెక్టార్ల ప్లాంటేషన్, జాఫర్‌పల్లి అర్బన్ ఫారెస్టు పార్కును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని చెప్పారు. అనంతరం ఆయన అనంతగిరిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, వికారాబాద్ ఎఫ్‌ఆర్‌ఓ శ్యాంకుమార్, పరిగి ఎఫ్‌ఆర్‌ఓ అబ్దుల్ హై, సెక్షన్ అధికారులు ఉన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు బంగారు భవిష్యత్తు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ విజయ్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఎన్‌సీసీ విభాగంలో పోటీతత్వం ప్రదర్శించడం అభినందనీయమని ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి, ఎన్‌సీసీ, ఏఎన్‌ఓ కెప్టెన్ డాక్టర్ జీ.విజయ్ అన్నారు. మండల పరిధి హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాండ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో వ్యవస్థాపకుడు ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్గిల్ విజయ్ దివాస్‌కు సంబంధించిన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో పాల్గొంటున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి, డాక్టర్ దామోదర్, శ్రీధర్ పాల్గొన్నారు.

పరిశోధనను ప్రోత్సహించడమే ధ్యేయం



డాటా పత్రాలను ఆవిష్కరిస్తున్న విదేశీ ప్రముఖులు

మొయినాబాద్‌రూరల్: ఎలక్ట్రానిక్స్ కంప్యూటరింగ్ కమ్యూనికేషన్లలో 5జీ డెవలప్‌మెంట్‌పై అంతర్జాతీయ సదస్సును నిర్వహించామని కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని అత్యుత్తమ నిపుణులను ఒకే చోట చేర్చడం, సాంకేతిక భవిష్యత్తును రూపొందించే స్థిరమైన అభివృద్ధికి దోహదపడే పరిశోధనను ప్రోత్సహించాలన్నదే యూనివర్సిటీ ఉద్దేశమని తెలిపారు. రెండు రోజుల పాటు పలు దేశాలకు సంబంధించిన 176 పత్రాలను సదస్సులో ప్రదర్శించామని పేర్కొన్నారు. ఇందులో 42 అర్హత కలిగిన పత్రాలను ఆమోదించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విదేశీ ప్రముఖులతో పాటు అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, డాక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

విజయానికి ఐదు సూత్రాలు

బాలమేధావి ఆకాష్ కోటి



ఆకాష్‌ను సన్మానిస్తున్న సుక్‌వల్లభ్ దాస్

మొయినాబాద్‌రూరల్: విజయానికి ఐదు సూత్రాలు ఉన్నాయని, వాటిని అనుసరిస్తే.. అపజయం మనదరి చేరదని స్పెల్‌బి అంతర్జాతీయ ఛాంపియన్ ఆకాష్ కోటి అన్నారు. శనివారం మండల పరిధి స్వామి నారాయణ గురుకుల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం బాల మేధావిని సన్మానించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన ఆకాష్.. చిన్నతనంలోనే ఆంగ్ల పదాల ఉచ్చారణలో ప్రావీణ్యం పొందారు. అప్పుడే పదాల ఉచ్చారణ పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఈ సందర్భంగా గురుకుల్ స్వామీజీ పూజ్య సుక్‌వల్లభ్ దాస్ మాట్లాడారు. నేషనల్ స్పెల్లింగ్ లీగ్ చరిత్రలో మొదటి తరగతి విద్యార్థిగా ఆకాశ్ పోటీ పడ్డారని తెలిపారు. 2018 నుంచి 23 వరకు ఆరు సార్లు ఈ పోటీల్లో పాల్గొన్న ఏకైక వ్యక్తి కోటీ అని కొనియాడారు. అనంతరం బాల మేధావి ఆకాష్ మాట్లాడుతూ.. విజయానికి ఐదు ముఖ్య సూత్రాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. కష్టపడి పని చేయడం పట్టుదల, శ్రద్ధ, క్రమ శిక్షణ, అంకిత భావంతో పనిచేస్తే.. విజయం మనదేనని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సతీష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆకాష్, కృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గృహిణి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన శివ, స్వప్న దంపతులు కొంతకాలంగా స్థానికంగా నివాసముంటున్నారు. శివ పని నిమిత్తం శనివారం ఉదయం బయటకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న స్వప్న(29) బలవన్మరణానికి పాల్పడింది. సాయంత్రం 4గంటలకు మృతురాలు భర్త ఇంటికి రాగా.. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో పగలగొట్టి చూడగా స్వప్న ఉరికి వేలాడుతూ కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా.. భార్యభర్తలిద్దరికీ.. వేర్వేరుగా వివాహాలు జరిగాయని, వారినుంచి విడిపోయి వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారని, వీరికి 5 నెలల పాప ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ మార్ట్ తనిఖీ



షాంపుల్ సేకరిస్తున్న సేఫ్టీ అధికారి ఉదయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌ను శనివారం ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ఉదయ్‌కిరణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్ట్‌లోని సామగ్రి నాణ్యత, ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మార్ట్‌లో తీసుకున్న ఎలిఫెంట్ డేట్స్‌లో పురుగులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులను సంప్రదించాడు. దీంతో అధికారులు తనిఖీ చేశారు. అనంతరం ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ.. ఫిర్యాదు అందడంతో మార్ట్‌ను తనిఖీ చేశామని తెలిపారు. ఎలిఫెంట్ డేట్స్ ప్యాకెట్లను సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీకి పంపామన్నారు. పరీక్షించిన అనంతరం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నిబంధనలను పాటించకుండా కాలం చెల్లిన సరకులను నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతల రోడ్లు.. పెరుగుతున్న ప్రమాదాలు

- రోడ్లకు మరమ్మతు చేయించండి: బీజేపీ శ్రేణుల డిమాండ్
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: గుంతల మయమైన రోడ్లతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ శ్రేణులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం మాట్లాడారు. తాండూరు మున్సిపల్ పరిధి వార్డుల్లో సీసీరోడ్లు పాడయ్యాయని, దీంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. రాత్రి వేళ వీధి దీపాలు సరిగా వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరారు. అదే విధంగా చెత్తను తరలించే వాహనాలు పాడైపోయాయని, తద్వారా పూర్తి స్థాయిలో అవి తిరగడం లేదని వెల్లడించారు. ఫలితంగా చెత్తచెదారం రోడ్లపై పేరుకుపోతుందన్నారు. వాహనాలకు మరమ్మతు చేయించి, చెత్త తరలింపును ముమ్మరం చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అంతారం కిరణ్, కౌన్సిలర్ బాలప్ప, ఉపాధ్యక్షులు మంతటి రాజు, దోమ కృష్ణ, ప్రకాష్, శ్రీకాంత్, బబ్లు, ప్రభాకర్ గౌడ్, శివకుమార్, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్' అప్రమత్తత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. శునకాల బెడద ఎక్కువైందని బ్లూక్రాస్ సొసైటీతో ఎంఓయూ చేసుకొని వాటికి ఇంజక్షన్లు ఇచ్చి, మరోచోటకి తరలిస్తామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల కోసం మహిళా శక్తి పథకం అమలు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సిబ్బంది, మెప్మా, ఆర్పీలకు పలు సూచనలు చేశారు. రానున్న మూడునెలలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో మేనేజర్ అంజన్‌కుమార్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు పౌరాణిక నాటకాలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: పౌరాణిక నాటకాలు సంస్కృతికి ప్రతిబింబాలని, ప్రాచీన కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గణేశ్ గార్డెన్‌లో శ్రీవాణి సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పౌరాణిక నాటక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డిలు హాజయ్యారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



వనమహోత్సవంలో పాల్గొన్న ఎంపీడీఓ అపర్ణ, ఏపీఓ వీరాసింగ్

ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, మానవాళి మనుగడకు మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ ఉద్యమస్ఫూర్తితో మొక్కలను నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాసింగ్, హెచ్ఎం యామిని, పంచాయతీ కార్యదర్శి అనిత, పోనమోని రమేశ్‌యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారాలు సరికాదు

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ నేతలు అసత్యపు ప్రచారాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ జిల్లా చైర్మన్ శ్రీనునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎంతో మంది గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఏ ఒక్కరోజు కూడా బాధిత కుటుంబాల గురించి మాట్లాడలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఆరునెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారని, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు తేడా చూసుకోవాలన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అందుకే బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో నాయకులు గణేశ్ నాయక్, నారాయణనాయక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐ, సిబ్బందిపై ఫిర్యాదు

చేవెళ్ల: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడి పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న వ్యక్తి చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇటీవల మండల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా.. పలువురు యువకులు పట్టుబడ్డారు. ఈ విషయంలో ఆ యువకులను పోలీసులు తిడుతూ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాధితుల్లో ఒకడైన ముడిమ్యాల గ్రామానికి చెందిన బి.మహేశ్.. ట్రాఫిక్ పోలీసుల తీరుతో అవమానం జరిగిందని, దీనికి కారణమైన సీఐ, కానిస్టేబుల్, హోంగార్డులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.


కంటి వైద్య శిబిరం

షాద్‌నగర్: పట్టణంలోని నవోదయ వృద్ధాశ్రమంలో శనివారం భవానీ కంటి ఆస్పత్రి, షాద్‌నగర్ లయన్స్ క్లబ్, బేరా సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ డాక్టర్ రెడ్యానాయక్ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సందీప్, లయన్స్ క్లబ్, బేరా ట్రస్టు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో జరభద్రం!

- వానకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్‌శాఖ అధికారులు
- సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచన

షాద్‌నగర్: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పరికరాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అప్రమత్తంగా ఉంటే విద్యుత్ ప్రమాదాలు నిరోధించొచ్చు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భూమి పూర్తిగా తడిపోయింది. దీనికి తోడు గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు ఇస్తున్న తగిన సలహాలు సూచనలు ఇవి.



షాద్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు కూడా కరెంటు ప్రవహిస్తుంది. వ్యవసాయ బావుల వద్ద, గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్తంభాలకు దూరం ఉండాలి. చిన్న పిల్లలను వీటి వద్దకు వెళ్లనీయొద్దు. ఇళ్లలో కూడా తడి చేతులతో స్విచ్‌లు వేయొద్దు. తడి గోడలను ముట్టుకోవడం మంచిది కాదు. ఉతికిన దుస్తులు ఆరవేయడానికి మహిళలు ఇంట్లో తీగలు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి విద్యుత్ వైర్లకు తాకకుండా చర్యలు తీసుకోవాలి. ఇళ్లపై నుంచి హైటెక్షన్ వైర్లు ఉన్నట్లయితే వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి పైకి ఎక్కకపోవడం మంచిది.

తడి చేయితో స్విచ్‌లు వేయొద్దు

టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, గ్రైండర్లు, మిక్సీలు, వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. తడి చేయితో వీటి స్విచ్‌లు వేయొద్దు. అసెంబుల్ ఉపకరణాలు ఉపయోగించే కంటే బ్రాండెడ్ పరికరాలు వాడితే మంచిది. సెల్‌ఫోన్‌లు చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చాలా దూరంగా ఉండాలి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాటి పక్క నుంచి నడిచినా విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. చాలా పశువులు రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడ్డాయి. ఈదురగాలులు వీచినప్పుడు కూడా తీగలు తెగిపోయి మీద పడే అవకాశాలు ఉన్నాయి.

సమాచారం ఇస్తే మేలు

ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు రావడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వర్షాకాలంలో జరుగుతుంటాయి. కొన్నిచోట్ల రైతులే మరమ్మతులు చేస్తుంటారు. ఇలా చేయడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి పనులు చేయొద్దు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే విద్యుత్‌శాఖా అధికారులకు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సర్వీస్ వైర్లను తాకొద్దు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, తడిగా ఉన్న గోడలు, సర్వీసు వైర్లను ఎవరూ తాకొద్దు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలి.

– వినోద్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, షాద్‌నగర్‌టౌన్

వ్యవసాయ బావుల వద్ద

వర్షాకాలంలో బోరుమోటార్లు వేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్టార్టర్ వద్ద తీగలు సరి చూసుకోవాలి. తెగిపోయి వేలాడే తీగలను ముందే గుర్తించాలి. ఒక్కోసారి విద్యుత్ తీగలు తెగిపోయి ఉంటాయి. వీటిని ముట్టినప్పుడు షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్టార్టర్ డబ్బాలను సురక్షిత ప్రాంతాల్లో అమర్చుకోవాలి. స్టార్టర్ వద్దకు వెళ్లేటప్పుడు చెప్పులు, చేతికి తొడుగులు ధరించాలి. అవి పాడైతే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటుగా మెకానిక్‌లకు చూపించాలి.